క్లుప్తంగా

ఎమ్మార్సీ కార్యాలయం తనిఖీ

జడ్చర్ల టౌన్: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఎమ్మార్సీ కార్యాలయాన్ని బుధవారం ఉదయం డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి రానున్న నేపథ్యంలో ఆయన ఎమ్మార్సీని సందర్శించి పరిస్థితులను పరిశీలించి వెళ్లారు.

నోట్‌పుస్తకాలు, బ్యాగుల పంపిణీ

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం శివారులో ఉన్న స్నేహ కంపెనీ ఫౌండేషన్ బుధవారం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సుమారు రూ.3లక్షల విలువగల పుస్తకాలు, బ్యాగులు అందజేసినట్లు హెచ్‌ఎం అనంతప్ప తెలియజేశారు. అలాగే ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, పలకలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో స్నేహ ఫౌండేషన్ ఏరియా జనరల్ మేనేజర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్లాంట్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కంప్యూటర్ బహూకరణ



మిడ్జిల్: మండలంలోని మసిగొండ్లపల్లి పాఠశాలకు బుధవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బుధవారం కంప్యూటర్ బహూకరించారు. పాఠశాలలో కంప్యూటర్ విద్యపై నిరుపేద విద్యార్థులకు అవగాహన కల్పించాలని హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి క్లబ్ సభ్యులను కోరడంతో వారు పాఠశాలకు కంప్యూటర్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

నవాబ్‌పేట: భర్త ఆచూకీ కనుక్కొని తనకు న్యాయం చేయాలని ఒక మహిళ పోలీసులను ఆశ్రయించింది. బుధవారం మండలంలోని దొడ్డిపల్లికి చెందిన పిచ్చకుంట్ల యాదయ్య (34)ను సోమవారం అదే గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల రాజు,శ్రీను,రాములు పొలం దగ్గర దాడిచేసినట్లు బాధితురాలు పిచ్చకుంట్ల మంజుల పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా ఈ ఘటన జరిగినరోజు నుంచి తన భర్త యాదయ్య కనబడకుండా పోయాడని పేర్కొంది. మూడురోజులు భర్త ఆచూకీ కోసం వెతికినా లాభం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.విషయంలో కేసునమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

వచ్చిందయ్యా..'ఆరుద్ర'



నవాబ్‌పేట: సాగులో ఆరుద్ర కార్తె మొదటి అడుగులాంటిది. ఈ కార్తెలో అన్ని విత్తనాలు వేయడం ముమ్మరం చేస్తారు. ప్రధానంగా ఆరుద్ర పురుగు ఈ కార్తెలోనే పొలాల్లో కనిపిస్తోంది. పురుగు కాస్త కనిపంచిందనుకో అన్నదాతకు మరింత ఊపొస్తుంది. తాజాగా వర్షాలు సరిగ్గా లేకపోవడంతో అన్నదాతలు ఆందోళనలో ఉన్న తరుణంలో ఈ పురుగు కాస్తా పొలాల్లో కనిపించిందంటే సాగుకు సరిపోను వానలు కురుస్తాయని రైతుల నమ్మకం. అలాగే ఆరుద్ర పురుగు సాగుకు మంచి శకునంలా రైతులు భావిస్తారు. ఆరుద్ర పురుగు మండలంలోని గురుకుంట సమీపంలోని వెంకటయ్య పొలంలో బుధవారం కనిపించింది.

మయూర వాహనంపై స్వామివారు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కంచికామకోటి పీఠం పాలమూరుశాఖ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 33వ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి ప్రాతకాల పూజలు, మూలమంత్ర జపం నిర్వహించారు. చంద్రమౌళీశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. మయూర వాహనంపై స్వామివారిని ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో వేంకటేశ్వర సేవా మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌శర్మ, ప్రధాన కార్యదర్శి గొండ్యాల రాఘవేంద్రశర్మ, శ్రీచంద్రశేఖర వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అమెరికా సామ్రాజ్య వాదాన్ని నిలదీయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రపంచ శాంతి కోసం అమెరికా సామ్రాజ్యవాదాన్ని నిలదీయాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి పిలుపునిచ్చారు. ప్రజాస్వామిక వాదులు, ప్రజా సంఘాలు నాయకుల ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ చౌరస్తాలో నిరసన చేపట్టారు. డీటీఎఫ్ నాయకులు శ్రీశైలం, వామన్‌కుమార్, ప్రభాకర్, మన్నెంకొండ, జలాల్‌పాషా, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగుతూ.. సాగుతూ..!

- అమృత్ 2.0 పనులకు వీడని గ్రహణం
- జడ్చర్ల పురపాలికలో నత్తనడకన ట్యాంకుల నిర్మాణాలు
- భూత్పూర్ మున్సిపాలిటీలో నేటికీ ప్రారంభం కాని పనులు



బూరెడ్డిపల్లి బ్రహ్మంగారి ఆలయం వద్ద నిర్మిస్తున్న ట్యాంకు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీల్లో భవిష్యత్‌లో 2 దశాబ్దాల వరకు నీటి సమస్య తలెత్తకుండా ఉండేలా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన అమృత్ 2.0 పథకం పనులకు గ్రహణం పట్టుకుంది. జిల్లాలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ మూడు మున్సిపాలిటీలు ఉండగా.. నీటి సమస్య పరిష్కారానికి అమృత్ 2.0 ద్వారా జడ్చర్ల మున్సిపాలిటీకి రూ.47కోట్లు, భూత్పూర్ మున్సిపాలిటీకి రూ.12 కోట్లు విడుదలయ్యాయి. ఈమేరకు గతేడాది జూన్‌లోనే ఇందుకు సంబంధించిన టెండరు ప్రక్రియను పూర్తిచేశారు. జడ్చర్ల మున్సిపాలిటీలో పనులు ప్రారంభ దశలో నత్తనడకన సాగుతుండగా.. భూత్పూర్‌లో అసలు పనులే ప్రారంభం కాలేదు.

జడ్చర్ల మున్సిపాలిటీలో..

జడ్చర్ల మున్సిపాలిటీలో అమృత్ 2.0 ద్వారా బూరెడ్డిపల్లి వద్ద బ్రహ్మంగారి ఆలయం పక్కన, ఎర్రగుట్ట డబుల్ బెడ్రూంల వద్ద, సిగ్నల్‌గడ్డ పెద్దట్యాంకు పక్కన, వంశీధర్ స్కూల్ వెనకాల, జాతీయ రహదారిపై డబుల్ బెడ్రూంల వద్ద మొత్తం 6ట్యాంకులు నిర్మించాలని ప్రతిపాదనలున్నాయి. వాటిలో 5ట్యాంకుల నిర్మాణాలు ఇటీవలే ప్రారంభమయ్యాయి. సిగ్నల్‌గడ్డపై నేటికీ పనులు ప్రారంభం కాలేదు. 2.31 కిమీ ఫీడర్ మెయిన్స్ వేయాల్సి ఉండగా.. కేవలం 30కి.మీ మాత్రమే పూర్తయ్యాయి. ఇంటింటికి నల్లా కనెక్షన్ల కోసం 62.5 కి.మీ మేర పైప్‌లైన్ వేయాల్సి ఉండగా.. నేటికీ పనులు ప్రారంభం కాలేదు. ఇందులో మొత్తం 8వేల వరకు నూతన కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది.

భూత్పూర్ మున్సిపాలిటీలో..

భూత్పూర్ మున్సిపాలిటీలో రూ.12కోట్లతో అమృత్ 2.0 కింద 5ట్యాంకులు, 1,106 నల్లా కనెక్షన్లు ఇవ్వాలన్న లక్ష్యం ఉంది. అయితే ట్యాంకుల నిర్మాణం చేపట్టాల్సిన స్థలాలు వివాదంలో ఉండడంతో పనులు ప్రారంభం కాలేదు. స్థల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు సమాచారం అందించారు. స్థల సమస్యలు పరిష్కారం అయితే తప్పా పనులు ప్రారంభించే ఆస్కారం లేకుండా పోయింది. ట్యాంకుల నిర్మాణాలు ప్రారంభం అయ్యాకే మిగిలిన పైప్‌లైన్ పనులు ముందుకుసాగుతాయి.

కొనసాగుతున్న పనులు

అమృత్ 2.0 ద్వారా రూ.47కోట్లతో మున్సిపాలిటీలో చేపట్టిన పనులు కొనసాగుతున్నాయి. పబ్లిక్ హెల్త్ విభాగం ద్వారా పనులు నడుస్తున్నాయి. 6 ట్యాంకులకుగానూ 5 ట్యాంకుల నిర్మాణం ఇటీవలే ప్రారంభమయ్యాయి. మిగిలిన ఒక ట్యాంకు పనులు ప్రారంభించాల్సి ఉంది. ఫీడర్ చానల్స్ పనులు కొనసాగుతుండగా.. ఇంటింటికీ కనెక్షన్‌లు ఇచ్చేందుకు 62కి.మీ మేర పైప్‌లైన్ వేయాల్సి ఉంది. వచ్చే ఏడాది వేసవి నాటికి అన్ని పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయి.

– లక్ష్మారెడ్డి, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటి

త్వరలోనే పనులు ప్రారంభం

అమృత్ 2.0 ద్వారా జడ్చర్ల మున్సిపాలిటీకి రూ.47కోట్లు, భూత్పూర్ మున్సిపాలిటీకి రూ.12కోట్లు మంజూరయ్యాయి. ఇందులో జడ్చర్ల మున్సిపాలిటీలో ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ పనులు ప్రారంభం అయ్యాయి. భూత్పూర్ కొన్ని సమస్యలతో ముందుకు సాగడంలేదు. త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– విజయభాస్కర్‌రెడ్డి, ఈఈ, మహబూబ్‌నగర్.

పోచమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక



మహబూబ్‌నగర్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు పాతపాలమూరులో పోచమ్మ (శీతలాదేవి) ఆలయ అభివృద్ధి కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మాజీ వార్డు కౌన్సిలర్ ఎన్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో వార్డు పెద్దలు సమావేశమై కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుగుణాకర్, ఉపాధ్యక్షుడిగా శాంతయ్య, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సహాయ కార్యదర్శిగా గిరి, కోశాధికారిగా మోహన్‌బాబుతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాదయ్య, నర్సింహ, లక్ష్మణ్, వెంకటస్వామి రమేశ్, యాదగిరి, మన్యం, కృష్ణయ్య, వెంకటేశ్, నాగయ్య, శివ, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

లోకకల్యాణార్థం చండీహోమం



జడ్చర్ల టౌన్: అమావాస్యను పురస్కరించుకొని మండలంలోని దేవునిగుట్టతండా వద్ద ఉన్న శ్రీగిరి క్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో బుధవారం లోకకల్యాణార్థం భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు. ఆచార్య కృష్ణానందస్వామి నేతృత్వంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి హోమం జరిపించారు. హోమంలో కందూర్‌కు చెందిన శేఖర్ లక్ష్మి, గోపాల్‌నాయక్ సరస్వతి, కవిత రాధ, నిర్మలారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణ, బాబు నాయక్ కూర్చున్నారు. హోమం సందర్భంగా అన్నదానం చేశారు. మండలంలోని మీనాంబరం పరుశవేదీశ్వర ఆలయంలో మాస శివరాత్రి పురస్కరించుకుని మంగళవారం రాత్రి, అమావాస్య సందర్భంగా బుధవారం అభిషేకాలు చేసి పల్లకీసేవ జరిపించారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలి



గండేడ్: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓ జనార్దన్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు ఫిలడెల్ఫియా తెలంగాణ అసోషియేషన్ ఆధ్వర్యంలో కందగట్ల వరప్రసాద్ 100 స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ విద్యార్థులలను ప్రోత్సాహం కల్పించడం అభినందనీయమన్నారు. వరప్రసాద్‌కు పాఠశాల, విద్యార్థుల తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పీటీఏ ప్రతినిధి డైరీ కోఆర్డినేటర్ మహిపాల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రాములు, విద్యావారధి ఇన్‌చార్జి జనార్దన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

'ఇరువర్గాల మధ్య గొడవలు సృష్టించొద్దు'



దళిత, ప్రజాసంఘాల నాయకుల సంఘీభావం

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్ ప్రాంగణంలో ఉర్దూ ఘర్ నిర్మాణం చేపట్టరాదని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కళాభవనంలో బహుజన మహనీయుల శోభయాత్ర ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. అంబేద్కర్ కళాభవనంలో అణగారిన వర్గాల ప్రజలు సాంస్కృతిక కార్యక్రమాలు, మహనీయుల జయంతులు, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని తెలిపారు. ఇంతకుముందు మైనారిటీ హాస్టల్ ఉన్నప్పుడు ముస్లింలు, ఎస్సీ నాయకులకు గొడవలు చోటుచేసుకున్న ఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. సర్కస్ గ్రౌండ్‌లో 20 ఎకరాల వక్ఫ్‌భూమి ఉందని, అలాగే పట్టణంలోని ఇతర ప్రాంతాల్లో వక్ఫ్ భూములు ఉన్నాయని తెలిపారు. ఈ విషయంపై మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్ చొరవ తీసుకుని దళిత, ముస్లింల మధ్య బేదాభిప్రాయాలు రాకుండా పునరాలోచన చేయాలని కోరారు. సమావేశంలో శోభయాత్ర ఉమ్మడి జిల్లా కమిటీ అధ్యక్షుడు రమేశ్, దళిత, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

డార్క్ మండలంలో ఇసుక అనుమతులివ్వొద్దు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మిడ్జిల్: డార్క్ మండలంలో మళ్లీ ఇసుక అనుమతులు ఇవ్వొద్దని బీజేవైఎం జిల్లా అధక్షుడు తిరుపతయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండు నెలలనుంచి అధికార పార్టీ అండదండలతో ఇసుక అక్రమ రవాణా చేశారని, బీజేపీ పోరాటం చేయడంతో ఇసుక రవాణా అనుమతులు కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రద్దు చేయిస్తే.. ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. మొదటి నుంచి బీజేపీ ఇసుక రవాణాపై పోరాటం చేస్తూ రైతుల పక్షాన నిలబడిందని, మళ్లీ ఇసుక రవాణాకు అనుమతులిస్తే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మండలాధ్యక్షుడు నరేశ్, భీమయ్య, బుచ్చయ్య, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

అధికార దాహంతో రాజ్యాంగం ఖూనీ



నవాబ్‌పేటలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులు

నవాబ్‌పేట: అధికార దాహంతో రాజ్యాంగాన్ని ఖూనీ చేసి అధికారం పొందేలా నాడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ సాగిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరబ్రహ్మచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎమర్జెన్సీకి 50ఏళ్లు పూర్తి కావచ్చిన సందర్భంగా సంవీధాన్ హత్య దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైస్ మండలాధ్యక్షుడు చంద్రప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం అధికారం కోసం రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కిందన్నారు. కనీసం నాటి మంత్రి వర్గానికి అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ సమాచారం ఇవ్వకుండా ఎమర్జెన్సీ నిర్ణయం తీసుకుని దేశంలో అలజడులు రేపిందని విమర్శించారు. అలాంటి పార్టీ నేడు రాజ్యాంగం చేతుల్లో పట్టుకుని ప్రజలను మభ్యపెట్టాలని చూస్తుందని విమర్శించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిచారు. కార్యక్రమాల్లో మండలాధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, గణేశ్, జిల్లా నాయకులు యాదయ్య, శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, రాఘవేంద్రచారి, కమలాకర్, వెంకటేశ్, రఘు, మల్లేశ్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అడ్డాకులలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్

అడ్డాకుల: యువతీ, యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో బుధవారం గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన కార్యక్రమంలో కళాశాల విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మత్తుతో కుటుంబాలు రోడ్డున పడడంతోపాటు యువతీ, యువకుల భవిష్యత్ ఛిన్నాభిన్నంగా మారుతుందన్నారు. గంజాయి, మద్యం జోలికి యువత పోవద్దని సూచించారు. చదువులపై దృష్టిపెట్టి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరేవిధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకుసాగాలని చెప్పారు. మైనర్లకు వాహనాలిచ్చి రోడ్డుపైకి పంపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

నవాబ్‌పేట: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఎస్సై విక్రమ్ బుధవారం డ్రగ్స్ నివారణపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

చదవడం, రాయడంలో నైపుణ్యం సాధించాలి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ రూరల్: తెలుగు చదవడం, రాయడంతోపాటు హిందీ, ఇంగ్లిష్ చదవడం, రాయడంలో నైపుణ్యం సంపాదించాలని కలెక్టర్ విజయేందిరబోయి సూచించారు. మండలంలోని ధర్మాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, ఆహార పదార్థాల మెనూను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం గురించి హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి గదిని సందర్శించి సాంఘిక శాస్త్రం బోధన, బోర్డుపైన ఇండియా మ్యాప్‌లో ఉత్తరాది రాష్ట్రాల గురించి విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. తప్పులు పోయినా బాగా ప్రాక్టీస్ చేయాలని, క్రమంగా పట్టు సాధించాలన్నారు. డిజిటల్ (ఏఐ) కంప్యూటర్ ల్యాబ్ బోధన గురించి తెలుసుకున్నారు. రోడ్డు అవతల ఉన్న ప్రాథమిక పాఠశాల రోడ్డు దాటి ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌కు రావడం ఇబ్బందిగా ఉందని కలెక్టర్ దృష్టికి ఉపాధ్యాయులు తీసుకొచ్చారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉన్న ఐదు కంప్యూటర్లలో రెండు ప్రాథమిక పాఠశాలకు అందజేయాలని సూచించారు.

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న పీయూ వీసీ శ్రీనివాస్, ఎస్పీ జానకి తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు మాదకద్రవ్యరహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. పీయూలో ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. తెలిసీ తెలియని వయస్సులో మాదకద్రవ్యాలకు అలవాటు పడడంతో భవిష్యత్ నాశనం అవుతుందని, కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని పేర్కొన్నారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ మాదకద్రవ్యాలతో యువత ఆరోగ్య, మానసిక పరిస్థితుల్లో అనేక మార్పులకు గురవుతాయని, దానివల్ల అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. యువత వాటిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు తమవంతుగా కృషి చేయాలని, ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రవీణ, ప్రోగ్రాం అధికారులు గాలెన్న, అర్జున్‌కుమార్, /జ్ఞానేశ్వర్, శివకుమార్‌సింగ్, ఈశ్వర్, చిన్నాదేవి తదితరులు పాల్గొనారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం సభ్యుడు

జడ్చర్ల టౌన్: విద్యార్థులు సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలని జిల్లా సురక్ష పోలీస్ కళాబృందం అవగాహన కల్పించారు. మండలంలోని కోడ్గల్ జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ విష్ణు, కళాబృందం రాములు, వరప్రసాద్, జగదీశ్, శివరాములు, కృష్ణయ్య విద్యార్థులకు సామాజిక అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండడంతో కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జడ్చర్ల బాలికల కళాశాలలో..

చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ఆధ్వర్యంలో నషాముక్త్ భారత్ అవగాహన కార్యక్రమాన్ని బుధవారం బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ యాదగిరి మాదకద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థులకు పీయూలో ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారని, నాణ్యత లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు పీయూ గేట్ వద్ద విద్యార్థులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్ పాల్గొన్నారు.

క్రీడలూ ముఖ్యమే

రాజాపూర్: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమని ఎస్‌ఐ శివానందంగౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ డ్రగ్స్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాధాకృష్ణ, హెచ్‌ఎం శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సేదతీరుతున్న రైతును కాటేసిన పాము

గండేడ్: పొలం పని చేసి సేద తీరుతున్న రైతును నాగుపాము కాటేయగా.. సకాలంలో వైద్యం అందడంతో ప్రాణాలతో బయటపడిన ఘటన గండీడ్ మండలంలో చోటుచేసుకున్నది. వివరాలిలా.. కొండాపూర్‌కు చెందిన గొల్ల రాజు బుధవారం మధ్యాహ్నం పొలం దగ్గర పనిచేశాడు. కొద్దిసేపటి తర్వాత అక్కడే పడుకున్నాడు. నాగుపాము చొక్కాలోకి చేరి వీపు మీద నాలుగైదు సార్లు కాటు వేసింది. రాజుకు ఏదో కరిచినట్లు అనిపించడంతో లేచి చూడగా.. నాగుపాము. కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో బాధితుడిని గండేడ్ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. డాక్టర్ చంద్రశేఖర్ పరీక్షించి యాంటీ స్నేక్ వీనమ్ ఇంజక్షన్లు ఇచ్చాడు. అనంతరం 108లో జిల్లా దవాఖాకు తరలించారు. గండీడ్‌లో సకాలంలో ప్రథమ చికిత్స చేయడంతో ప్రాణపాయం తప్పింది. ప్రస్తుతం రాజు ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

హిందూ సంఘటితానికి కృషి చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రతి ఒక్కరూ హిందూ సంఘటితం కోసం పనిచేయాలని రాష్ట్ర సద్భావన సంపర్క్ టోలీ సభ్యుడు ఎన్‌వీకే ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోనిలో బుధ వారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో సద్భావన సమావేశం నిర్వహించారు. ముందుగా భరతమాత చిత్రపటానికి పూజలు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్‌వీకే ప్రసాద్ మాట్లాడారు. సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘచాలక్ వెంకటేశ్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల విద్యాభివృద్ధికి కృషి



అడ్డాకుల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తామని స్నేహ ఫౌండేషన్ మేనేజర్ రామేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్తులకు బుధవారం స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలను ఎంఈఓ కురుమూర్తితో కలిసి అందజేశారు. హైస్కూల్‌లో సుమారు 240 బ్యాగులు, 4,850 నోట్ పుస్తకాలు, ప్రాథమిక పాఠశాలలో 122 బ్యాగులు, 860 నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలి క వసతులను తమ ఫౌండేషన్ ద్వారా కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజాపూర్: మండలంలోని ఈద్గాన్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వెంకటేశ్ బుధవారం పేర్కొన్నారు. కోడ్గల్ నుంచి ఈద్గాన్‌పల్లి సబ్‌స్టేషన్‌కు వచ్చే 33 కేవీలైన్ మరమ్మతులు, విద్యుత్ లైన్‌ల కింద ట్రీ కటింగ్ చేయనున్నందున అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విజ్ఞాన సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:అమావాస్యను పురస్కరించుకుని బుధవారం రాత్రి స్థానిక కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డులోని విజ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నాగరాజు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బదిలీ చేసిన వారిని తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాజాపూర్ కేజీబీవీలో తప్పులు చేసినవారిని వదిలేసి సంబంధంలేని వారిని బదిలీ చేశారని, వెంటనే వారికి న్యాయం చేయాలని కోరుతూ యూటీఎఫ్ సంఘం నాయకులు డీఈఓకు విన్నవించారు. ఈమేరకు యూటీఎఫ్ నాయకులు రవికుమార్, వెంకటేశ్ మాట్లాడుతూ.. రాజాపూర్ పాఠశాలకు 7 మండలాలకు చెందిన ఉపాధ్యాయులను బదిలీ చేసి, రాజాపూర్ కేజీబీవీ వారిని వేరే కేజీబీవీలకు బదిలీ చేశారన్నారు. విద్యార్థులకు చదువులు సరిగ్గా చెప్పకుండా నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిపోయి సంబంధంలేని వారిపై చర్యలు తీసుకోవడం సరైంది కాదన్నారు.